

సమరభేరిని విజయవంతం చేయాలి

భీమడోలు:సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబర్ 4వ తేదీ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే సమరభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు కోరారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రముఖులతో కలిసి ఆయన శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గుత్తికొండ వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడారు. ఈ నెలాఖరు వరకూ పార్టీ ఆధ్వర్యంలో సమస్యల గురించి వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తామని, సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన గ్రామ సచివాలయాల వద్ద వినతి పత్రాలు అందజేస్తామన్నారు. సెప్టెంబర్ 4న మండల కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్టా భాస్కరరావు, నారపల్లి రమణారావు, బి.నాగరాజు, వీరాజు, వి.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

బియ్యం ధరలు పైపైకి..!



- గతంతో పోలిస్తే 25 శాతం పెరుగుదల
- బస్తాపై రూ. 350 అదనం
- కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల
- ఉమ్మడి పశ్చిమలో తగ్గిన వినియోగం

ప్రజాశక్తి - భీమవరం

సామాన్య ప్రజానీకం గుండెల్లో బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు. గతంతో పోలిస్తే 25 శాతం బియ్యం ధరలు పెరిగాయి. బస్తాపై సుమారు రూ.350 అదనంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యత బట్టి కిలో రూ.60 నుంచి రూ.65కు ఎగబాకింది. అయితే దిగుబడి తగ్గడమే దీనికి కారణమని చెబుతున్నప్పటికీ సన్న రకం బియ్యం తినుబడి పెరగడంతో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని రిటైల్ వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు తిప్పలు తప్పట్లేదు.

ఒకప్పుడు సన్న రకం బియ్యాన్ని ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలే వినియోగించేవారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలూ మక్కువ చూపుతున్నారు. పౌర సరఫరాల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాసిరకంగా ఉండడం ఎక్కువశాతం మంది సన్న బియ్యంపై మక్కువ చూపుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. మొన్నటి వరకూ 26 కిలోల బస్తా రూ.1,200 ఉంటే, ప్రస్తుతం రూ.1500లకు పెరిగింది. నాణ్యమైన బియ్యం 20కిలోల బస్తా రూ.1,600 పలుకుతోంది. అంటే అతికొద్ది రోజుల వ్యవధిలోనే 25 శాతం మేర ధరలు పెరిగాయి.

సామాన్య, మధ్య తరగతి ప్రజల నెలవారీ బడ్జెట్‌ను పెంచాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఐదేళ్లలో ఉమ్మడి పశ్చిమలో బియ్యం వినియోగం గణనీయంగా తగ్గింది. 2018 అమ్మకాలతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు సుమారు 25 శాతం తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆహార నియమాలు పెరగడం, సాయంత్రం పూట అధిక జనాభా అల్పాహారంతో సరిపెట్టడంతో బియ్యం వినియోగం తగ్గింది. అయినప్పటికీ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పండిస్తున్న వరి పంట ఇక్కడ వినియోగించడం లేదు. ఎదుకంటే ఇక్కడ ముతకరకం బియ్యం ఉత్పత్తి అవుతాయి. ముతక బియ్యం ఉత్తరాది రాష్ట్రాలకు ఎగు మతవుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు లెవీ తీసుకుని రేషన్ డిపోల ద్వారా పేదలకందిస్తున్న ముతక బియ్యం కొంతభాగం మరలా రీ సైక్లింగ్ అవుతుంటే కొంత భాగం రొయ్యలు, చేపల చెరువులకు, పశువుల దాణాగా వినియోగిస్తున్నారు. స్థానికంగా పండే వరి పంట ద్వారా వచ్చే బియ్యం స్థానిక అవసరాల్లో పదిశాతం మించి వినియోగం కావడం లేదు. మిగిలిన 9 శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతైన సన్న బియ్యాన్నే ఉమ్మడి జిల్లాలో వినియోగిస్తున్నారు.

మూడు నెలల్లో బస్తాపై రూ. 350 పెంపు

ఈ ఏడాది మార్చిలో 25 కేజీల బియ్యం బస్తా రూ.1,200 ఉంది. ఏప్రిల్‌లో రూ.1,450, ఆగస్టులో రూ.1,500 దాటి విక్రయిస్తున్నారు. మూడు నెలల కాలంలో బియ్యం బస్తాపై రూ.350 పెరిగింది. కర్నూల్ సోనామసూరి బియ్యం వంద కిలోలు రూ.6,800 పలుకుతున్నాయి. వ్యాపారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసి కృత్రిమ కొరత సష్టించి ధర పెంచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బిపిటి 76 కిలోల ధాన్యం బస్తా ఏప్రిల్‌లో రూ.2,350 నుంచి రూ.2,500 పలికింది. ప్రస్తుతం రూ.2,850 నుంచి రూ.మూడు వేల పలుకుతున్న పరిస్థితి.

కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల

పన్నుల ఉపశమనం పొందడానికి 26 కిలోలు, 30 కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 25 కేజీల వరకూ బ్రాండ్‌తో అమ్ముతున్న బియ్యానికి పన్ను వసూలు చేస్తున్నారు. 26 కిలోలు దాటితే పన్ను ఉండదు. దీన్ని దష్టిలో ఉంచుకొని వ్యాపారులు 26 కేజీల బస్తాలను విక్రయిస్తున్నారు. 26 కిలోల సన్న బియ్యం బస్తా ఏప్రిల్‌లో రూ.1400 ఉంది. డీమార్ట్‌లో రూ.1750 పలుకుతోంది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడం వల్ల ధాన్యం దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ధరలు పెరిగాయి.

రేషన్ బియ్యం తినేందుకు విముఖత..

పౌర సరఫరా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పేద ప్రజానీకం తింటున్నప్పటికీ ఎక్కువ శాతం విముఖత చూపుతున్నారు. ఇవి తినడం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని రేషన్ లబ్ధిదారులు చెబుతుండడంతో తినుబడి తగ్గుతున్న పరిస్థితి. విచిత్రం ఏంటంటే కిలో రూపాయి బియ్యం కొనుక్కున్న పౌరులు సైతం కోటా బియ్యాన్ని రిటైల్ దుకాణాల్లో మార్పిడి చేసుకుంటున్న పరిస్థితి. కోటా బియ్యం బ్లాక్ మార్కెట్లో కిలో రూ.12లకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం 50 శాతం మరలా రిటైల్ బియ్యం వర్తకుల ద్వారా రైస్ మిల్లులకు చేరి కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి మరలా ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు వస్తున్నాయి. ఈ విధానంలో దళారులకు కిలోకు ఖర్చులు పోనూ ఎనిమిది రూపాయలు మిగులుతున్నట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కోటా బియాన్ని మార్పిడి చేసుకోవడం లేదా అమ్మకాలు జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో కోటా బియ్యాన్ని పశువులకు, చేపల, రొయ్యల చెరువుల్లో మేత గా వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

ప్రమాదం మాటను ఆరోగ్యం

పాలిష్ పట్టిన బియ్యం, సన్నరకాల బియ్యంలో చెక్కర శాతం ఎక్కువుగా ఉంటుందని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆ బియ్యం తినడం వల్ల మరింతగా ఆరోగ్య సమస్యలు ఎదువురతాయని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ వాటివైపే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పట్టు తక్కువ బియ్యం, బ్రౌన్ రైస్, ముతక బియ్యం, రంగుమారిన బియ్యం, దంపుడు బియ్యం తినడం ద్వారా మధుమేహం కొంతమేరకు అదుపు అయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

రేషన్ బియ్యంలో పోషక విలువలు

జిల్లా అధికార యంత్రాంగం అవగాహన

రేషన్ బియ్యంలో పోషక విలువలు దాగి ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. ఆగస్టు 8వ తేదీన డిఆర్‌డిఎ, మెప్మా, సిడిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో రేషన్ బియ్యంతో 108 వంటకాలు తయారీ పోటీలను ఏర్పాటు చేసి అవగాహన చేపట్టింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సంయుక్తంగా వంటకాల పోటీలను పరిశీలించి రుచి చూశారు. రేషన్ బియ్యాన్ని తక్కువగా భావించడం సరికాదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను కలపడం ద్వారా ఈ బియ్యం వినియోగించే లబ్ధిదారులకు ఐరన్, విటమిన్ బి12, పోలిక్ యాసిడ్ సంపూర్ణంగా అందుతాయని అవగాహన కల్పించారు.



తుక్కులూరు వద్ద టిడిపి, వైసిపి శ్రేణులను చెదరగొడుతున్న పోలీసులు

ఉత్సాహం.. ఉద్రిక్తత నడుమ యువగళం

- సమస్యలు వింటూ.. హామీలిస్తూ ముందుకు సాగిన లోకేష్
- వైసిపి శ్రేణుల కవ్వింపుతో తుక్కులూరులో ఘర్షణ
- మామిడి, పామాయిల్ రైతులతో ముఖాముఖి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్, ముసునూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లాలో తొలిరోజు శుక్రవారం తెలుగు యువత ఉత్సాహం నడుమ, వైసిపి కార్యకర్తల కవ్వింపులతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ సాగింది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం మీర్జాపురం గ్రామానికి యువగళం పాదయాత్ర గురువారం రాత్రి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ పాదయాత్ర 194వ రోజు శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో మీర్జాపురం నుంచి ప్రారంభమైంది. ఆ గ్రామంలో పలుచోట్ల మహిళలతో లోకేష్ ముచ్చటించారు. అనంతరం యాత్ర గొల్లపల్లి గ్రామం చేరుకోగా నాలుగు రోడ్ల కూడలి వద్ద గజమాలతో మహిళలు లోకేష్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకేష్ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న ప్రయివేటు స్కూల్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. అనంతరం మోర్సపూడి గ్రామానికి యాత్ర చేరుకోగా వేర్వేరు సెంటర్లలో మామిడికాయలు, కొబ్బరికాయలతో కూడిన గజమాలలు వేసి యాత్రకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయల్దేరిన యాత్ర మోర్సపూడి మీదుగా తుక్కులూరు చేరుకోగా మహిళలు ఘన స్వాగతం పలికారు. తుక్కులూరులోనే భోజన విరామానికి ఆగారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నూజివీడు శివార్లలో మార్కెట్ యార్డు సమీపంలో మామిడి, పామాయిల్ రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిర్చి, పొగాకు పంటల మాదిరిగా మామిడి పంటకు కూడా బోర్డు పెట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తాము అధికారంలోకి రాగానే మామిడి బోర్డు పెడతామని, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అక్కడి మామిడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు మన రాష్ట్రంలోని మామిడి రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, మీటర్లు పెట్టేందుకు సమ్మితిస్తూ సంతకాలు పెట్టొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. జగన్‌కు రైతుల సమస్యలపై అవగాహన లేదని, బటన్ నొక్కడం తప్ప ఆయనకు ఇంకేమీ తెలీదని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పామాయిల్ రైతులకు అద్భుతమైన గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పారు. అనంతరం పాదయాత్ర నూజివీడు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా సాగి నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లె చేరుకుంది. రాత్రికి యాత్ర అక్కడే బస చేసింది.



మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

తుక్కులూరు వద్ద తీవ్ర ఉద్రిక్తత

యువగళం పాదయాత్ర తుక్కులూరు సెంటర్ వద్ద వైసిపి నేత కొలుసు కాసులు ఇంటి వద్దకు వచ్చేసరికి నలుగురైదుగురు వైసిపి కార్యకర్తలు తమ పార్టీ జెండాలు ఊపుతూ సైకో జగన్ పాట ఆపాలంటూ నినాదాలు చేశారు. దీన్ని యువగళం వాలంటీర్లు ప్రతిఘటించడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కొందరు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని యువగళం టీమ్ సభ్యులను నిలువరిస్తూ వైసిపి శ్రేణులను అక్కడి నుంచి పంపించేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలవ్వగా రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘర్షణపై టిడిపి నేత మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్ కుమారుడు ఆశిష్, మరో నేత వెంకటప్ప వైసిపి నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు రశీదు ఇవ్వకపోవడంతో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు ఫిర్యాదు అందినట్లు రశీదు ఇవ్వడంతో ఆందోళన విరమించారు. టిడిపి నేతల ఫిర్యాదులో కొందరు వైసిపి నేతల పేర్లు పేర్కొంటూ వారు ఉద్దేశపూర్వకంగా బీరుసీసాలు, రాళ్లతో పాదయాత్రలోకి చొరబడి దాడి చేశారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో వైసిపి నేతలు కవ్వింపు చర్యలకు దిగే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులకు చెప్పినప్పటికీ వైసిపి నేతలను పోలీసులు అడ్డుకోలేదని టిడిపి నేతలు విమర్శించారు.

ప్రభుత్వ రాయితీలపై అవగాహన : జెసి

రూ.38.67 లక్షల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం

ప్రజాశక్తి - ఏలూరు

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ రాయితీ వివరాలను కరపత్రాల ద్వారా అన్ని మండల పరిషత్ అధికారులకు, తహశీల్దార్లకు తెలియజేసి, తగిన ప్రచారం కల్పించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరును జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి బి.లావణ్యవేణి మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రాయితీలను కల్పిస్తుందని, ఈ సమాచారం క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాల్సి వుందన్నారు. అదే విధంగా బ్యాంకుల్లో కూడా సంబంధిత సమాచారాన్ని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు ప్రతిపాధించిన స్థలంలో ఆక్రమణలు, కోర్టుకేసులు లేదా ఇతర సమస్యలు లేని భూమిని గుర్తించి, వెంటనే నివేదిక సమర్పించాలని ద్వారకా తిరుమల తహశీల్దారును తెలియజేశారు.

ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ పాలసీ(ఐడిపి) 2020-23 కింద ఎస్‌విసి కమిటీచే సిఫార్స్ చేయబడిన మూడు పెట్టుబడి రాయితీ, నాలుగు విద్యుత్ సబ్సిడీ క్లయిమ్‌లుకు గాను వాటికి రూ.38.67 లక్షల సబ్సిడీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. పిఎంఇజిపి పథకం కింద బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న 125 దరఖాస్తులను పరిశీలించి, వాటిని బ్యాంకు కో-ఆర్డినేటర్లు, బ్యాంకు మేనేజర్ల సమన్వయంతో వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎం నీలాద్రిని జెసి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి.ఏసుదాసు, నాబార్డు డిడియం అనిల్ కాంత్, దళిత ఇండస్ట్రియల్ అసోషియేషన్ సిర్రా భరత్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఎల్‌డియం నీలాద్రి, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, ఉద్యానశాఖ డిడిఎస్ రామ్మోహన్, డిటిసి ఎస్.శాంతకుమారి, ఎపిఐఐసి జోనల్ మేనేజరు కె.బాబ్జి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన నేత్రదాన అవగాహన కరపత్రాలను, ప్రతిజ్ఞ పత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో నేత్రదాన అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్నియా లోపంతో దృష్టి కోల్పోయిన వారు మన దేశంలో సుమారు 12 లక్షల మంది ఉన్నారన్నారు. ఏటా సుమారు 25 వేల మంది కొత్తగా ఈ కార్నియా లోపంతో దృష్టి కోల్పోతున్నారన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది యువత ఉన్నారన్నారు. వీరికి సరిపడా కార్నియా లభ్యమైతే వీరందరూ అంధులుగా మిగిలిపోవాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర ఐ బ్యాంకుల ద్వారా సుమారు 50 వేల నుంచి 75 వేల కార్నియాలు మాత్రమే సేకరించగలుగుతున్నామన్నారు. కానీ మనకు లక్ష నుంచి లక్షా 50 వేల కార్నియా అవసరం ఉందన్నారు. ఈ అంతరం పూరించడానికి దేశవ్యాప్తంగా ఏటా సెప్టెంబరు 8వ తేదీ వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఉపాధ్యక్షులు, డిఎంహెచ్‌ఒ డి.ఆశ, ప్రోగ్రాం మేనేజరు మల్లికార్జునరాజు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, అగ్రిగోల్డ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏలూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు యర్రా వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 27 ఆదివారం ఉదయం ఏలూరు ఆర్ఆర్ పేటలో ఉన్న సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులతో, అగ్రిగోల్డ్ బాధితులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పాల్గొంటున్నారని, రౌండ్ టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులను, అగ్రిగోల్డ్ బాధితులను ఆహ్వానించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ పాల్గొనాలని యర్రా వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ముమ్మరంగా వంతెన నిర్మాణ పనులు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువపై, గుండుగొలను వద్ద శిథిలమై కూలిపోయిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఉంగుటూరు ఎంఎల్ఎ వాసు బాబు తెలిపారు. రూ. 3.30 కోట్ల వ్యయంతో వంద టన్నుల సామర్థ్యం గల నూతన వంతెన నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులతోనూ, జాతీయ రహదారుల రాజమండ్రి కార్యాలయ ప్రతినిధులతోనూ ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణ ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు నవంబర్ లేదా డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఒక సంవత్సరకాల వ్యవధిలోనే అనుమతులు లభించటం, నిర్మాణాలు ప్రారంభం, పూర్తి కావడం వెనుక సిఎం అందజేసిన సహాయ, సహకారాలు ఎంతైనా ఉన్నాయన్నారు. నిర్మాణ సమయంలో గుండుగొలను దాని పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు లేకుండా చూసేందుకు రవాణా కోసం బెయిలీ వంతెనను నిర్మించామన్నారు. సాగు, తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం వంతెన పిల్లర్ పనులు పూర్తయ్యాయని, వాటి క్యాపింగ్ పనులు పూరైన తర్వాత వంతెన నిర్మాణ పనులు వేగవంతమవుతాయని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తైతే పర్యాటక కేంద్రంగా కొల్లేరు ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇదేవిధంగా బ్రిటీష్‌కాలం నాటి గుండుగొలను-పోతునూరు-ఏలూరు జాతీయ రహదారి నిర్మాణం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏలూరు-కైకలూరు ప్రాంతాలకు దగ్గర మార్గం ఏర్పడుతుందన్నారు. ఆధ్యాత్మిక కేంద్రం కొల్లేరు పెద్దింట్లమ్మ దేవస్థానానికి వెళ్లేందుకు మంచి మార్గం ఏర్పడుతుందన్నారు. దీనితోపాటు ఆక్వారంగం అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు, వక్స్ బోర్డు డైరెక్టర్ జహీర్, గుండుగొలను వైసిపి గ్రామ సచివాలయాల కన్వీనర్ మురళి, ఎంపిపి కనుమాల రామయ్య పాల్గొన్నారు.



వంతెన పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

విఆర్ఎలపై నిర్బంధం తగదు : సిఐటియు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఇచ్చిన హామీలను అమలు చేయమనడిగితే నిర్భంధాలు ఏంటని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రశ్నించారు. శుక్రవారం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో పోచారపు వెంకన్నబాబు అధ్యక్షతన విఆర్ఎ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ విఆర్ఎలకు కనీస వేతనం రూ.26వేలు ఇస్తానని హామీ ఇచ్చి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఇచ్చిన వాగ్దానం మరచారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని విఆర్ఎలు ఆందోళన చేస్తుంటే విఆర్ఎలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుకు వెళ్లనివ్వకుండా విఆర్ఎలకు ముందస్తు నోటీసులు ఇచ్చి నిర్భంధించారన్నారు. అరెస్టులతో, నిర్భంధాలతో పోరాటాలను ఆపలేరని, ప్రభుత్వం అక్రమ అరెస్టులు ఆపి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విఆర్ఎలు చింతిరాల ముత్తేష్, మాచర్ల శేఖర్, గోలి మారుతి, మోతుకురి వెంకటేశ్వర్లు, చినరాజు, కాకర్ల శ్రీను పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న ముగ్గురు చిన్నారులు

సురక్షితంగా బయటకు తీసిన పోలీసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లిఫ్ట్‌లో ఇరుక్కున్న ముగ్గురు చిన్నారులు పోలీసుల చొరవతో సురక్షితంగా బయటపడిన సంఘటన పట్టణంలోని శిఖామణి ప్రార్థనామందిరం సమీపంలోని రాజా అపార్ట్‌మెంట్లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24వ తేదీ రాత్రి రాజా అపార్ట్‌మెంట్ సమీపంలో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన ముగ్గురు చిన్నారులు ఆడుకుంటూ అపార్టుమెంట్‌కు వెళ్లారు. లిఫ్ట్‌లోకి వెళ్లి ఆడుకుంటుండగా ఒక్కసారిగా లిఫ్ట్ ఆన్ అయ్యింది. మధ్యలోకి వెళ్లేసరికి సాంకేతిక లోపంతో లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో చిన్నారులు సుమారు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ లిఫ్ట్‌లోనే ఇరుక్కుపోయారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హెచ్‌సి శ్రీనివాసరెడ్డి, ఎస్‌బి హెచ్‌సి ఎవిఎస్ రాజు, కానిస్టేబుల్ రవికుమార్ లిఫ్ట్‌ను పరిశీలించి, లిఫ్ట్ మిషన్‌ను స్క్రూ డ్రైవర్‌తో తొలగించి చిన్నారులను కిందకు దించారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. స్పందించి తక్షణ చర్యలు తీసుకున్న పోలీసులును పలువురు అభినందించారు.



లిఫ్ట్‌లో ఇరుక్కున్న చిన్నారులను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం టి.నరసాపురంలో టిడిపి కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణారావు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసులు మాట్లాడుతూ దగాపడ్డ ఆంధ్రుల కోసం జనబలమై యువగళం పాదయాత్రగా వస్తున్న నారా లోకేష్ పాదయాత్ర ఈ నెల 28వ తేదీన పోలవరం నియోజకవర్గంలో టి.నరసాపురం మండలంలోకి ప్రవేశిస్తుందని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని యువ గళం పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ముత్తారెడ్డి, ప్రధాన కార్యదర్శులు నాయుడు రాంబాబు, శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, మాజీ జడ్‌పిటిసి నల్లూరి వెంకట చలపతిరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతలపూడి : యువగళం పాదయాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని షాదీఖానాలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆధ్వర్యంలో చింతలపూడి మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, లింగపాలెం మండల అధ్యక్షులు గరిమళ్ళ చలపతిరావు అధ్యక్షతన 27న జరగబోయే యువగళం పాదయాత్ర గురించి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళంలో అరాచకాలు సృష్టించాలని ప్రయత్నించినా ఓర్పు, సహనంతో శాంతియుతంగా పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, లింగపాలెం మండల మాజీ జడ్‌పిటిసి గుత్తా సత్య సాయివరప్రసాద్, అధ్యక్షులు నత్త రవి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చింతలపూడి నియోజకవర్గంలో నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర జయప్రదం చేయాలని చింతలపూడి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, మండలాల టిడిపి కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ యువ గళం రథసారధి నారా లోకేష్ బాబు పాదయాత్ర ఆదివారం ఉదయం చింతలపూడి నియోజకవర్గంలో వలసపల్లి అడ్డరోడ్డు నుంచి ధర్మాజీ గూడెం, మఠంగూడెం, లింగపాలెం, చింతలపూడి, టి.నరసాపురం, రావికంపాడు మీదుగా జంగారెడ్డిగూడెం వరకూ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర టిడిపి కార్యదర్శి దాసరి శ్యాంసుందర్ శేషు, మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ పాల్గొన్నారు.

చాట్రాయి : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర నూజివీడులో శుక్రవారం నిర్వహించారు. ఈ పాదయాత్రలో పాల్గొనటానికి టిడిపి నాయకులు, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చాట్రాయి మండలంలోని వివిధ గ్రామాల టిడిపి నాయకులు పలగాని దుర్గారావు, కంచర్ల హనుమంతరావు, రాయవరపు పుల్లారావు, సీతారామయ్య తరలివెళ్లారు.

హెల్మెట్ తప్పనిసరి

చింతలపూడి : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చింతలపూడి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్‌కె ఆజాద్ తెలిపారు. చింతలపూడి పట్టణంలో జహీర్ హీరో షోరూమ్‌లో హీరో గ్లామర్ కొత్త వెర్షన్ ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జహీర్ మోటర్స్ హీరో షోరూమ్ అధినేత సయ్యాద్ ఖాజామోహిద్దిన్ మాట్లాడుతూ గతంలో ఉన్న గ్లామర్ వెర్షన్‌కు కొత్త వెర్షన్‌ను హీరో మోటోకార్ప్ ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూవీలర్స్ ఫైనాన్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణ, రాజేష్ నాయుడు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు కిషోర్, ఖలీల్, రవి, రామకృష్ణ సూరి పాల్గొన్నారు.

నేరాలపై దృష్టి సారిస్తాం : డిఎస్‌పి

చింతలపూడి : చింతలపూడిలో జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ధనుంజయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ధనుంజయ విలేకరులతో మాట్లాడుతూ చింతలపూడి మండలంలో భూ తగాదాలు ఎక్కువగా ఉన్నాయని, నేరాలను అదుపు చేయటానికి తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. పేకాట, కోడిపందేళ్లు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రెవెన్యూ తగాదాలపై తహశీల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ మల్లేశ్వరావు, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తా..

కైకలూరు : గ్రామీణ వైద్యుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకు వెళతామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సిఎన్ఆర్ గార్డెన్‌లో ఇవిఆర్ హాస్పిటల్ సౌజన్యంతో ఆర్ఎంపి డాక్టర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలసి ఆయన పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో సకాలంలో వైద్యం చేస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మీ సమస్యలు రాసి ఇవ్వండి సిఎం దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. యూనియన్ బలోపేతానికి స్థలము కావాలని ప్రతిపాదించగా, స్థల సేకరణ చేసి త్వరలో మీకు తెలియపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, కైకలూరు ఆర్ఎంపి డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు : సెప్టెంబర్ 9వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి వ్యాప్తంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి జి.రాజేశ్వరి విలేఖర్ల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనములో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులతోనూ, ఎపిఎస్ఆర్‌టిసి లేబర్ డిపార్ట్మెంట్, విద్యుత్ శాఖ అధికారులతో, పిటిషనర్ న్యాయవాదులతో, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్‌తో కేసుల పరిష్కారం నిమిత్తం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ జులై 22వ తేదీన నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 130 వాహన ప్రమాద పరిహార కేసులను రాజీ చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, విజయకుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అగ్నిప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధం

భీమడోలు : గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న లింగం పాడు ఆవాస ప్రాంతం వద్ద శుక్రవారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఒక తాటాకిళ్లు దగ్ధమైంది. రూ.20వేల ఆస్థి నష్టం సంభవించింది. భీమడోలు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంకొండ వెంకటలక్ష్మికి చెందిన నివాస గృహంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుని తాటాకు ఇళ్ల పైకప్పు కాలిపోయింది. సమాచారం అందుకుని చేరుకున్న ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాన్ని అదుపు చేశారు. ఇంటిలోని సుమారు రూ.1.20 లక్షల విలువైన సామాగ్రిని రక్షించారు.

పేకాట స్థావరంపై పోలీసులు దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. శుక్రవారం పోలీసులకు అందిన సమాచారం మేరకు సిఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ సాగర్ బాబు పోలీస్ సిబ్బందితో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేశారు. ఈ సందర్భంగా సిఐ రాజేష్ మాట్లాడుతూ బాటగంగనమ్మ లేఅవుట్ కాలనీ సమీపంలోని నిర్మానుష తోటలలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి 11 వాహనాలు, 13 సెల్ ఫోన్లు, రూ.73 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం

నూజివీడు రూరల్ : బొరవంచా గ్రామానికి చెందిన తలారి కిరణ్ (20) కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. సమీపంలోని వారు గమనించి సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో కిరణ్‌ను నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

గుండుగొలనులో విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

నాణ్యమైన విద్యుత్ తక్కువ ధరకు అందించేందుకు ప్రయత్నం : ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - భీమడోలు



విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసు బాబు

రానున్న కాలంలో అవసరాలకు సరిపడా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు తెలిపారు. గుండుగొలనులో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 5 ఎంవి సామర్థ్యం గల 33/11-కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు తూర్పు ప్రాంత విద్యుత్ సరఫరా సంస్థ ఎస్ఇ సాల్మన్‌రాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరకు విద్యుత్ అందించే క్రమంలో సోలార్, విండ్(గాలి మరలు), రీ రెన్యూబుల్ విధానాలలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఈ తరహా విద్యుత్ సరఫరా విధానం అమల్లోకి వచ్చిందన్నారు. విండ్, సోలార్ విధానం ద్వారా పదివేల మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉంగుటూరు నియోజకవర్గ విషయానికి వస్తే నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరా సమస్యలు తీర్చేందుకు, నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. దీనిలో భాగంగా ప్రస్తుతం గుండుగొలనులో ప్రారంభించిన తరహాలోనే నిడమర్రులో ఇదే సామర్థ్యం ఉన్న విద్యుత్ కేంద్రానికి రెండు రోజుల్లో ప్రారంభోత్సవం చేయనున్నామన్నారు. ఇదేవిధంగా గణపవరం, కేశవరం, తోకలపల్లి, రాచూరులో విద్యుత్ ఉప కేంద్రాల పనులు ప్రారంభం కానున్నాయని, ఇదే తరహాలో మరో నాలుగు విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు లభించాయన్నారు. ఇదే క్రమంలో వీటన్నింటికీ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు భీమడోలు తరహాలోనే గణపవరం కేంద్రంగా 132/33/11 కెవి సామర్థ్యం ఉన్న విద్యుత్ కేంద్రాన్ని రూ.120 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలిపారు. వీటన్నింటికీ తోడు జగనన్న కాలనీలతో పాటు ఇతర కాలనీలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎస్ఇ సాల్మన్ రాజు మాట్లాడుతూ గుండుగొలను కేంద్రంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో దశాబ్దాలుగా విద్యుత్ సమస్య ఎదుర్కొంటున్న గుండుగొలను, దాని పరిసర ప్రాంతాల వారికి విద్యుత్ సమస్యలు తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇఇ శశిధర్, డిఇ వెంకటేశ్వరరావు, భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ, గ్రామ ఉపసర్పంచి సూర్యనారాయణ, ఎంపిపి కనుమాల రామయ్య పాల్గొన్నారు.

అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

ఏలూరు : అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిసిహెచ్ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంతవరకూ 126 మంది ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామన్నారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లు తమ వివరాలతో కార్యాలయం పనివేళలలో దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు జారీ చేస్తామని ప్రభాకర్ తెలియజేసారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎస్‌టి బాలికల కళాశాల వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కెఆర్‌పురం ఐటిడిఎ కార్యాలయంలో పరిపాలన అధికారి(ఎఒ) పివి రామారావుకి పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వినతిని అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు ఇ.భూషణం, బి.వినోద్ ఎఒతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం ఎస్‌టి బాలికల కళాశాల వసతి గృహ భవనములు విద్యార్థులకు సరిపోవడం లేదన్నారు.

9వ తేదీ వరకూ దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు నగరంలో నిర్వహిస్తున్న ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మొదటి రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తయ్యాయి. శుక్రవారం రాత్రి వరకూ ఈ ఎంపిక విధానం ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన రేంజ్ పరిధిలో ఎస్ఐ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభించారు. ఏలూరు రేంజ్లో 8,247 మంది పురుష అభ్యర్థులు, 1,142 మహిళా అభ్యర్థులు తమ సత్తా చాటుకుని ఉద్యోగ నియామకం పొందేందుకు సన్నద్ధం అయ్యారు. ఈ పరీక్షలు నేటి నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకూ నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన..

గుండుగొలనుగుంట ప్రజలు హర్షం

ద్వారకా తిరుమల : ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ నుంచి గుండుగోలుగుంట వెళ్లే రోడ్డు నిర్మాణ పనులను గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు శుక్రవారం పరిశీలించారు. ఎంతోకాలంగా ఈ రోడ్డు గతుకులమయంగా ఉండేది. ఇటీవల ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో గుండుగోలనుగుంట వెళ్లే ప్రజలు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండల వైఎస్ఆర్‌సిపి యువనేత బొండాడ వెంకన్నబాబు, ద్వారకాతిరుమల సొసైటీ అధ్యక్షులు కుర్రాల లక్ష్మణ్, జడ్‌పిటిసి చిగురుపల్లి శామ్యూల్ పాల్గొన్నారు.

జలజీవన్‌తో శుద్ధి జలాలు..

కొల్లేరు గ్రామాలకు వరం జలజీవన్ : ఎంఎల్ఎ

కైకలూరు : జలజీవన్ మిషన్‌తో కొల్లేరు గ్రామాలకు శుద్ధి చేసిన మంచినీరు లభిస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గుమ్మళ్లపాడులో రూ.32 లక్షల జలజీవన్ మిషన్ ద్వారా నిర్మితం కాబోతున్న మంచినీటి పైపులైన్ పనులను ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శాస్త్రీ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి ఆలపాటి సస్పెండ్

ఏలూరు టౌన్ : దెందులూరు నియోజకవర్గం, పెదవేగి మండలం, మొండూరు గ్రామానికి చెందిన ఆలపాటి నరసింహ మూర్తి వైసిపిలో వుంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్టు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్టు వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ఆళ్ల నాని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే విషయమై దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి పార్టీ అధిష్టానంకు ఫిర్యాదు చేసారని తెలిపారు. ఈ ఫిర్యాదును కుణ్ణంగా పరిశీలించి సస్పెండ్ చేసినట్టు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు గోనె సంచులపై దృష్టి పెట్టండి : కలెక్టర్

వన్ టైం యూజ్ గోనెసంచులను కొనుగోలు చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి తమిళనాడు, కేరళ రాష్ట్రాల మాదిరిగా వన్ టైం యూజ్ గోనెసంచులను కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పిఎసిఎస్‌లకు సుమారు రూ.30 కోట్లు జమచేయబడిన కమీషన్ మొత్తాన్ని ఉపయోగించి గోనె సంచులు కొనుగోలు చేయాలన్నారు. ఈనెల 29వ తేదీన జిల్లాలో టాప్ 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలతో సమావేశం ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజూ భార్గవిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా గోనెసంచుల కొనుగోలుకు సంబంధించి ఎక్కువ ధాన్యం కొనుగోలు ప్రాంతాలకు చెందిన దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల ఎంఎల్ఎలతో మాట్లాడాలని జిల్లా రైస్ మిల్లర్ల అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరికి కలెక్టర్ సూచించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్‌పర్సన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాన్ ఆక్వా జోన్‌లో వ్యవసాయ భూమిని ఆక్వా జోన్‌గా మార్చాలని, మిగిలిన ఆక్వా రైతులకు విద్యుత్‌పై రాయితీ ఇవ్వాలని కోరగా ఏప్రిల్ నుంచి మత్స్యశాఖ ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదని సంబంధిత అధికారులు తెలియజేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి జివివి సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్యశాఖ కమీషనరు సూచనలు మేరకు రాష్ట్రంలో విద్యుత్ సబ్సిడీల సమస్యల పరిష్కారం కోసం మత్స్యకార సర్వే దిద్దుబాట్లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏలూరు జిల్లాకు చెందిన విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు ఇ.మత్స్యకార్ పోర్టల్‌లో ఇఫిష్ సర్వే దిద్దుబాట్లను అప్ లోడ్ చేశారన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు వైఆర్‌కెపిఆర్ బాబ్జీ, యలమర్తి నాగవెంకట సత్యనారాయణ, పల్లె రవీంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఉద్యానశాఖ డిడి ఎస్.రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు, ఎపిఎంఐపి పిడి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి - ఏలూరు

మండల ప్రత్యేక అధికారులు వారంలో ప్రతీ శుక్ర, శనివారాలు తమ మండలంలో పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు అధికారులు శుక్రవారం మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించారు. జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి కృపావరం, దెందులూరు గ్రామంలోని సచివాలయం-2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి, మహిళలకు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి గ్రామాల్లో అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు.

భీమడోలు : పౌష్టికాహారంతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని ఐసిడిఎస్, అంగన్‌వాడీలకు మండల ప్రత్యేక అధికారి, గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఆర్.విజయరాజు సూచించారు. పోలసానిపల్లి గ్రామంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం ద్వారా అమలవుతున్న వివిధ పథకాల వివరాలు పరిశీలించారు. ఆపై గ్రామ పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల మధ్య వయస్సులైన 240 మంది పిల్లలలో 14 మందికి బరువు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. గ్రామంలోని 22 మంది గర్భిణీలు నిర్ణీత క్రమంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. వీరందరికీ ప్రభుత్వపరంగా పౌష్టికాహారాన్ని అందజేయాలని ఐసిడిఎస్, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎపిఎం సురేష్, గృహ నిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ సతీష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

జిల్లాలో 99.88 శాతం సర్వే పూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఇంటింటి జాబితా పరిశీలన, నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లాలోని 7 నియోజకవర్గాల ఇఆర్‌ఒలతో ఓటర్ల జాబితా సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన ఇంటింటి ఓటర్ల సర్వే 99.88 శాతం పూర్తయిందన్నారు. అక్టోబరు 17న ఓటర్ల ముసాయిదా జాబితా విడదల చేస్తామని, దానిని రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షుణంగా పరిశీలన చేసి తప్పొప్పులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సరిచేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, డిఆర్‌ఒ ఎవిఎస్ఎస్ మూర్తి, నెరుసు నెలరాజు(బిజెపి), పి.కిషోర్(సిపియం), రాజనాల రామ్మోహన్ రావు(ఐఎన్‌సి), కలవకొల్లు సాంబ(వైఎస్ఆర్‌సిపి), ఎస్.అచ్యుత బాబు(టిడిపి), యం.ధశరధ కుమార్(ఆమ్ ఆద్మీ పార్టీ), ఈఆర్‌ఒలైన సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డిఒలు కె.పెంచల కిషోర్ పాల్గొన్నారు.

181 మిలియన్ కిలోల వర్జీనియా పొగాకు విక్రయం

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో 181 మిలియన్ కిలోల వర్జినియా పొగాకు అమ్మకాలు జరిగాయని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వేలం 32వ కేంద్రం, 25వ వార్షికోత్సవం సందర్భంగా ఎన్ఎల్ఎస్ ఏరియా లోని 5 పొగాకు బోర్డుల పరిధిలో, పొగాకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొగాకు బోర్డు ఇడి అద్దంకి శ్రీధర్‌బాబు ముందుగా 32 వేల కేంద్రం 25వ వార్షికోత్సవ కేక్‌ను కట్ చేసి, రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడారు. 2022-23 సంవత్సర పొగాకు అమ్మకాలకు కిలోకు రూ.247 సరాసరి ధర లభించడం హర్షణీయమన్నారు. గతేడాది సరాసరి ధర కంటే సుమారు 50 రూపాయల వరకూ అధికంగా రైతులకు లభించిందని తెలిపారు. రైతు పండించే బ్రైట్, మీడియంలో గ్రేట్ పొగాకులకు గిట్టుబాటు ధర లభించిందన్నారు. సుమారు 140 రోజుల్లో వేలం నిర్వహణ ముగిసినట్లు తెలిపారు. ఈ ఏడాది పొగాకు రైతులు అదనంగా పండించిన పంటకు అపరాధ రుసుము లేకుండా వేలం నిర్వహణ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు విజిలెన్స్ ఒఎస్‌డి జి.దామోదర్, రీజనల్ మేనేజర్ ఆది శేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'వైసిపి బలోపేతానికి కృషి చేస్తాం'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి





వైసిపి జిల్లా కార్యదర్శిగా మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెంకు చెందిన సీనియర్ నాయకులు మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఆగిరిపల్లికి చెందిన తులిమిల్లి పావవజ్యోతి సుజనాకుమారిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వైసిపి బలోపేతానికి అహర్నిశలు పాటు పడతామని, అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా వారు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు, వారి తనయులు వేణుగోపాల అప్పారావు(చంటినాయన)కు కృతజ్ఞతలు తెలియజేశారు. పలువురు వైసిపి నాయకులు వారిని అభినందించారు.

కనీస వేతన చట్ట ప్రకారం వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - చాట్రాయి

కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ అనుబంధ ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు తెలిపారు. సిపిఐఎంఎల్ లిబరేషన్ అనుబంధ ఎఐసిసిటియు ఆధ్వర్యంలో శుక్రవారం చాట్రాయి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహశీల్దార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా డి.పుల్లారావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాల రాస్తుంటే, ఆ ప్రభుత్వానికి వంత పాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను దగా చేస్తుందని ఆరోపించారు. అమరావతి లేబర్ కమిషన్ ఏప్రిల్‌లో విడుదల చేసిన గజిట్ పబ్లికేషన్ ప్రకారం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా శానిటేషన్ కార్మికులకు రోజుకు కనీస వేతనం రూ.508 నిర్ణయించిందన్నారు. కానీ ప్రభుత్వం కార్మికులకు కేవలం రూ.3 వేల నుంచి రూ.6 వేల వేతనం చెల్లిస్తూ, కార్మికుల కుటుంబాలను కష్టాల సుడి గుండంలోకి నెట్టి, వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. లేబర్ కమిషన్ సిఫార్సుల మేరకు కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే రాబోయే కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని పుల్లారావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు డి.పూజిత, మిడ్‌డేమీల్స్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు బిలుగూది ఆనందరావు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు విజయ కుమారి, క్లాప్ మిత్ర మండల అధ్యక్షులు దుర్గం చిన్నప్ప, కంచర్ల సురేష్, అబ్బ దాసరి రాములు, వేల్పుల వడ్డీ కాసులు, కుప్పాల శ్రీను, తాళ్లూరి ఏసు పాల్గొన్నారు.

అనివేటి మండపంతో తొలగనున్న భక్తుల ఇక్కట్లు

ప్రజాశక్తి - కైకలూరు

కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయం ముందు నిర్మితమవుతున్న అనివేటి మండపంతో భక్తులకు ఇక్కట్లు తొలగుతాయని నాయకులు తెలిపారు. ప్రధాన స్తంభాలకు జరుగుతున్న శిల్పపు పనులను శుక్రవారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షులు భట్రాజు శివాజీ, పెంచికలమర్రు సర్పంచి జయమంగళ కాసులు పాల్గొన్నారు.

ఇంటింటా కరపత్రాలు పంపిణీ : టిడిపి

ప్రజాశక్తి - ఉంగుటూరు

వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఎందుకు గెలిపించాలో 'మహాశక్తి' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ, ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తున్నామని టిడిపి నాయకులు వెల్లడించారు. శుక్రవారం గోపీనాథపట్నంలో 'భవిష్యత్‌కు గ్యారంటీ', 'మహాశక్తి' కార్యక్రమంలో భాగంగా వైసిపి ప్రభుత్వం చేస్తున్న పథకాలు, పాలనలో అక్రమాలను వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జి సింగులూరి రామకృష్ణ, పరిశీలకులు షేక్ మీరా, బొడ్డు శాంతకుమారి, గంటా ఆంజనేయులు, చెరుకూరి హేమంత్, గంటా గోపి, చెన్ను సత్యవేణి, గంట ఉషారాణి, ఉన్నమట్ల సునీత, మరపట్ల రామతులసమ్మ పాల్గొన్నారు.